సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



పెరిగిన వేతనం..
వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తాజాగా పీజీటీలకు వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. -IIలో



బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు
ఇంటర్ చదువుతున్న బాలికకు వివాహం చేసే ప్రయత్నాలను ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. -IIలో

గరిష్టం/కనిష్టం
33.0/22.6

వాతావరణం
జిల్లాలో గురువారం 22.6 - 33.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

ఆత్మీయంగా పలకరిస్తూ...

- కడప ఎయిర్‌పోర్టు, దర్గా వద్ద ముఖ్యమంత్రికి ఘన స్వాగతం
- దర్గా గురువుల మజార్లకు పూలచాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు



పెద్ద దర్గాలో చాదర్ సమర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి కడప : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం కడపకు చేరుకుని పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నంద్యాల జిల్లా అవుకు టన్నెల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం నేరుగా హెలికాప్టర్ ద్వారా ముఖ్యమంత్రి 2.25 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.అక్కడి నుంచి రోడ్డు మార్గాన 2.55 గంటలకు పెద్దదర్గాకు చేరుకున్న ముఖ్యమంత్రికి పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్‌తోపాటు ఇతర నాయకులు ఘన స్వాగతంపలికారు. అక్కడున్న నేతలు, కార్యకర్తలను ఒక్కొక్కరిని ఆప్యాయంగా పలుకరిస్తూ సీఎం ముందుకు కదిలారు.

పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దదర్గాలోకి రాగానే దర్గా సంప్రదాయబద్ధంగా తలపాగా ధరింపజేశారు. అనంతరం గురువుల మజార్లను దర్శించుకుని పూలచాదర్ సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలతోపాటు ఫాతెహా నిర్వహించారు. దర్గాలో కొద్దిసేపు గడిపిన సీఎం సమీపంలోనే ఉన్న దర్గా ప్రతినిధులు, భక్తులు అందరితో చాలా సేపు ముచ్చటించారు. అనంతరం దర్గాలోని గ్రంథాలయంలో పీఠాధిపతితో కాసేపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్దదర్గాకు సంబంధించిన పలు అంశాలను పీఠాధిపతి వివరించారు.

రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు రోడ్డుకు ఇరువైపులా జనం కిక్కిరిసిపోయారు. ఎయిర్ పోర్టు నుంచి పెద్దదర్గాకు వచ్చేటపుడు కాన్వాయ్‌లో వాహనం నుంచే అందరికీ అభివాదం చేస్తూ వచ్చిన సీఎం...తర్వాత పెద్ద దర్గాలో ప్రార్థనలనంతరం, వెళ్లే సమయంలోనూ జనాలు కిక్కిరిసిపోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంటూ కేకలు వేయడంతో దర్గా బయట కొద్దిసేపు వాహనం నిలిపి మహిళలతో మాట్లాడారు. అటు, ఇటుగా ఉన్న ప్రజలకు నమస్కరిస్తూ ముందుకు కదిలారు.





మహిళ సమస్యను ఆలకిస్తున్న సీఎం

పటిష్ట బందోబస్తు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒకరోజు పర్యటనను పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఎయిర్‌పోర్టు నుంచి పెద్దదర్గా వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా ముగియడానికి పోలీసులు ప్రత్యేక కృషి చేశారు.



ప్రార్థనలో పాల్గొన్న సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీ



అభిమాన నాయకుడిని చూసి ప్రజల కేరింతలు



ఉరుసుకు సంబంధించిన బ్రోచర్ సీఎంకు అందజేత

వైభవం...పీఠాధిపతి నగరోత్సవం

యువతలో వెల్లువెత్తిన ఆనందం

కడప కల్చరల్: ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రమైన అమీర్‌పీర్ (పెద్ద) దర్గా ఉరుసు మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ నగరోత్సవాన్ని కడపలో వైభవంగా నిర్వహించారు. ఉదయం ఫకీర్లు, ఇతర శిష్య గణాలతో కలిసి పీఠాదిపతి పెద్దదర్గా నుంచి పెన్నానది అటువైపు తీరాన గల గండి వాటర్ వర్క్స్ కొండలోని గుహల వద్దకు వెళ్లి జెండా ప్రతిష్టించి ఫాతెహా నిర్వహించారు. తర్వాత ఆ ప్రాంతంలో హజరత్ మస్తాన్‌స్వామి స్మారకంగా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అక్కడి నుంచి ఊరేగింపుగా కడప నగరానికి తిరిగి వచ్చారు. పలు వాహనాలలో ఆయన శిష్యులు, ప్రముఖులు ఆయన వెంట ఊరేగింపులో పాల్గొన్నారు. రాత్రి మాసాపేటలోని హజరత్ మై అల్లా దర్గా షరీఫ్ వద్ద నుంచి పీఠాధిపతి ఫకీర్లు, సంఘ ప్రతినిధులతో విద్యుద్దీపాలు, పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై నగరంలో ఊరేగింపుగా బయలుదేరారు. దాదాపు అన్ని కూడళ్లలో భక్తులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. బ్యాండు మేళాలకు అనుగుణంగా నృత్యాలు ప్రదర్శించారు. ఊరేగింపు తెల్లవారుజామున తిరిగి దర్గాకు చేరి ఊరేగింపుగా తెచ్చిన చాదర్‌ను గురువు మజార్‌కు సమర్పించారు.



ప్రత్యేక వాహనంలో ఆశీనులైన దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్



జులుస్‌కు హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

9న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: కడపజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం డిసెంబరు 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత డిసెంబరు 12వ తేది జరపాలని నిర్ణయించినా పార్లమెంటు శీతాకాల సమావేశాలు 2వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న కారణంగా 9వ తేదికి మార్పు చేసినట్లు తెలిపారు.

కబడ్డీ చాంపియన్‌షిప్ పరిశీలకుడిగా శ్రీధర్



కడప స్పోర్ట్స్: కర్నూలు జిల్లా గోనెగండ్లలో నిర్వహిస్తున్న 70వ ఆంధ్రా స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉమన్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పరిశీలకుడుగా కడప డీఎస్ఏ కబడ్డీ కోచ్ ఆర్.వి. శ్రీధర్‌ను నియమిస్తూ శాప్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ పోటీలు నిర్వహించనున్నారు.

3,4,5 తేదీల్లో అగ్రిటెక్ సదస్సు

కడప అగ్రికల్చర్: గుంటూరు లాం ఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 3,4,5 తేదీల్లో అగ్రిటెక్ -23 వ్యవసాయ సదస్సు జరగనుంది. దీనిని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఊటుకూరు ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ సదస్సులో 125 పైగా ప్రదర్శనలు, 50 వేలకుపైగా సందర్శకులు వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ నిపుణుల ప్రసంగాలు కూడా ఉంటాయని తెలిపారు.

నూతన నియామకం



ఓబుల్ కొండారెడ్డి

కడప అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన కానాల పెద్ద ఓబుల్‌రెడ్డి కుమారుడు కానాల ఓబుల్ కొండారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ పదవిలో సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఉండేవారు. అయనను ఇటీవల ప్రభుత్వం రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారుగా ఎంపిక చేశారు. దీంతో ఆ పదవికి కానాల ఓబుల్‌కొండారెడ్డిని ఎంపిక చేసింది. ఇందుకు ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డిలకు ధన్యావాదాలు తెలిపారు.

ఘనంగా భక్త కనకదాసు జయంతి

వైవీయూ: కడప నగరం కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత కార్యాలయంలో గురువారం శ్రీభక్త కనకదాసు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్‌లు భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ శ్రీకృష్ణునికి గొప్ప భక్తుడైన కనకదాసు ఆధ్యాత్మిక కవిగా, తత్వవేత్తగా, సంగీతకారుడు, స్వరకర్తగా తన సంకీర్తనలతో సాధారణ ప్రజలను ఆధ్యాత్మికత వైపు నడిపించిన గొప్ప సంకీర్తనాచార్యుడని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు అవ్వారు మల్లికార్జున, కురబ సంఘం నాయకులు బాలశివచంద్ర, సాంబశివుడు, బీసీ వెల్ఫేర్, కార్పొరేషన్ సిబ్బంది, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.



భక్త కనకదాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, బీసీ సంఘం నాయకులు

8 మండలాల్లో వర్షం

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడంన కారణంగా జిల్లాలో 8 మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో సిద్దవటంలో 13.4 మిల్లీమీటర్లు, బద్వేల్‌ల్లో 8.2, గోపవరంలో 7.2, ఒంటిమిట్టలో 4.6, వీఎస్‌పల్లోలో 1.8 , బి కోడూరులో 1.4, అట్లూరు, వేములలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

జమ్మలమడుగు: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పతంగే రామన్న రావు పాఠశాల ఆవరణలో దివ్యాంగులకు పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 16 నెలల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించిన ప్పుడు దివ్యాంగుల కోసం ఓ మంచి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో 42 మెడికల్ క్యాంపులను నిర్వహించామన్నారు.ఈ క్యాంపుల ద్వారా 6509 దివ్యాంగులను గుర్తించి వారికి 9120 పరికారాలను పంపిణి చేస్తున్నామన్నారు. మంచి చేసేవారిని ప్రజలు గుర్తించి వారికి అండగా నిలవాలన్నారు.



వినికి పరికాలు పంపిణీ చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి.. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాటి సర్కార్‌కు.. నేటి ప్రభుత్వానికి తేడా గమనించాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

టీడీపీ ప్రభుత్వ హాయంలో దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో గుర్తు చేసుకోవాలి. ప్రస్తుత ప్రభుత్వం ఏవిధంగా మేలు చేస్తుందో అన్న విషయాన్ని గమనించాలని ఎమ్మెల్యేడాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో దివ్యాంగులు ప్రతి నెల గ్రామ సెక్రటరీలు ఎక్కడ పింఛన్ ఇస్తారో కనుక్కొని ఆ ప్రాంతాలకు వెళ్లి గంటల తరబడి నిలుచోవాల్సిన పరిస్థితి ఉండేది. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్ నగదు ఇస్తున్నట్లు చెప్పారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అలింకో వారి ఆధ్వర్యంలో రూ. 90లక్షల ఎంపీ గ్రాంట్ విడుదల చేయించడం ద్వారా రూ.5.80కోట్ల విలువైన పరికరాలను పంపిణీ చేశామన్నారు. .అందరికీ మేలు చేసే వైఎస్ జగన్‌కు అండగా నిలవా లన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శి వమ్మ, వైఎస్ చైర్మన్లు పో రెడ్డి రామలక్షుమ్మ, సింగరయ్య,ఎంపీపీ హరిత, హస్తకళల అభివృద్ధి చై ర్మన్ బడిగించల విజయలక్ష్మీ, హజ్ కమిటీ చైర్మన్ గా స్‌లాజం,హార్టీకల్చర్ చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఏడీ ఆర్వీ కిరణ్ పాల్గొన్నారు

అవగాహనతోనే రక్షణ

- హెచ్‌ఐవీ బాధితులకు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా చికిత్స
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం



ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్

కడప రూరల్: హెచ్‌ఐవీ..ఈ పేరు ప్రపంచాన్ని గడగడలాడించింది. అంతకుముందు.. తరువాత ఈ వ్యాధి గురించి తెలియక..అవగాహన లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. క్రమేణా పరిస్థితుల్లో కాస్త మార్పులు వచ్చాయి. ఫలితంగా బాధితుల సంఖ్య తగ్గు ముఖం పడుతూ వచ్చింది. అయినా కూడా హెచ్‌ఐవీ తాను ఉన్నానంటూ ఉనికిని చాటుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ మహమ్మారిని పూర్తిగా భూ స్థాపితం చేయడానికి గట్టి చర్యలు చేపడుతోంది.

ఏఆర్‌టీ సెంటర్ల కీలక పాత్ర...

హెచ్‌ఐవీ నియంత్రణలో ఏఆర్‌టీ (అంటీ రిట్రో వైరల్ ట్రీట్‌మెంట్) కేంద్రాలు కీలక పాత్రను పోషిస్తున్నాయి. వీటిని హెచ్‌ఐవీ వైరస్‌ను అదుపు చేసే చికిత్సా కేంద్రాలు అని కూడా అంటారు. ఇవి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కడప, జిల్లా ఆసుపత్రి ప్రొద్దుటూరులో ఉన్నాయి. అనుబంధంగా (లింక్ ఏఆర్టీ సెంటర్స్) ఉన్న అన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌లో నడుస్తున్నాయి. వ్యాధి గ్రస్తులు కడప, ప్రొద్దుటూరు కేంద్రాల్లో తమ పేరును నమోదు చేసుకుంటే మిగతా లింక్ ఏఆర్టీ సెంటర్లలో ఉచితంగా మందులను పొందవచ్చు. ఈ మందులు బయట మందుల షాపుల్లో కొనుగోలు చేయాలంటే ఒక నెలకు రూ 10 వేలకు పైగా అవుతుంది.

పెన్షన్ ద్వారా 2450 మందికి లబ్ధి...

ఏఆర్‌టీ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకొని, వీటి ద్వారా మందులు పొందుతున్న పేషెంట్లకు ప్రభుత్వం పెన్షన్ ఇస్తోంది. గత టీడీపీ పాలనలో ఒకరికి ఒక నెలకు కేవలం రూ 1000 మాత్రమే మంజూరు చేసేది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని కేటగిరీల పెన్షన్లను పెంచారు. వీరి పెన్షన్ కూడా రూ 1000 నుంచి రూ 2750కు పెరిగింది. వ్యాధి గ్రస్తులకు కొందరు దాతలు సహాయం అందిస్తున్నారు. భారతి సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో జీవిస్తున్న చిన్నారులకు విలువైన పోషక ఆహారాన్ని ఆందిస్తున్నారు.

హెచ్‌ఐవీ నివారణకు చర్యలు

ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఆ మేరకు జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఐవీ నివారణకు చర్యలు చేపడుతున్నాం. హెచ్‌ఐవీ నిర్ధారణ అయిన వారికి నిర్దేశించిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యసేవలను అందజేస్తున్నాం. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా డిసెంబరు 1వ తేదిన జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలను నిర్వహిస్తున్నాం.
– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, కడప

చైతన్యవంతం కావాలి

హెచ్‌ఐవీ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. మంచి అలవాట్లు, నడవడికతోహెచ్‌ఐవీ/ఎయిడ్స్‌కు అడ్డుకట్ట వేయవచ్చు. ఈ వ్యాధికి సంబంధించి ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలి. హెచ్‌ఐవీ నివారణ కోసం పలు చర్యలు చేపడుతున్నాం.
– డాక్టర్ రవిబాబు, జిల్లా ఎయిడ్స్,టీబీ నివారణ అధికారి, కడప

జిల్లాలో 7,730 మంది బాధితులు

ఈ హెచ్‌ఐవీ వైరస్ 1980లో సౌత్ ఆఫ్రికాలో వెలుగు చూసింది. అక్కడ ఉన్న చింపాంజీల ద్వారా ఈ వైరస్ వచ్చినట్లుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. అక్కడ నుంచి ఈ వ్యాధి ప్రపంచ మంతటా వ్యాపించింది. తీవ్రతను గమనించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ నివారణ చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగా 1987 డిసెంబర్ 1వ తేదీని ప్రపంచ ఎయిడ్స్ దినంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి ఏటా డిసెంబర్ 1వ తేదీన ఎయిడ్స్ నిర్మూలనకు ప్రభుత్వాలు వివిధ అవగామన కార్యక్రమాలు చేపడుతున్నాయి. మన దేశంలో 1985లో చెన్నైలో మొదటి కేసు నమోదైంది. జిల్లాలో అనధికారికంగా 1986లో, అధికారికంగా 2001-2002లో ప్రథమ కేసును గుర్తించారు. బాధితుల సంఖ్య గ్రామాల్లో కంటే పట్టణాల్లోనే ఎక్కువగా కనిపించింది. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల తదితర పట్టణాల్లో కేసులు అధికంగా నమోదయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యల చేపట్టడంతో కేసులు దాదాపుగా కనుమరుగయ్యే స్థితికి చేరింది.

జిల్లాలో హెచ్‌ఐవీ వ్యాధి గ్రస్తుల వివరాలు

ఏడాది	హెచ్‌ఐవీ పరీక్షలు పొందినవారు	హెచ్‌ఐవీ నిర్ధారణ వ్యాధిగ్రస్థులు
2010-11	59,679	1827
2011-12	61,868	1491
2012-13	57,666	1215
2013-14	78,706	1181
2014-15	95,822	1193
2015-16	70,285	915
2016-17	71,210	969
2017-18	76,759	997
2018-19	1,17,746	818
2019-20	92,256	816
2020-21	40,562	404
2021-22	80,804	559
2022-23	1,20,979	665
2023-24 (అక్టోబరువరకు)	64,939	339

'ఎస్సీ,ఎస్టీ చట్టం' అమలుకు పోర్టల్

కడప రూరల్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం-1989 అమలుకు సంబంధించి ఆన్‌లైన్ పర్యవేక్షణకు ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను రూపొందించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఏపీసీఈఎస్ఎస్ విధానాన్ని అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. అఘాయిత్యానికి గురైన బాధితులు ఎక్కడి నుంచైనా సరే పీఓఏ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు స్వభావం ఆధారంగా సంబంధిత అధికారులకు సమాచారం చేరుతుందన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు.హుండీల ద్వారా 71 రోజులకు రూ.18, 64,414 నగదు, 2 గ్రాముల బగారు,1600 గ్రాముల వెండి వచ్చిందని చెప్పారు. కడప దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం నిర్వహించానట్లు చెప్పారు. ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, చక్రాయపేట బ్యాంకు అధికారి సాయి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ నిలుపుదల

వైవీయూ: మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, కడప ఆధ్వర్యంలో జారీ అయిన 01/2023 నోటిఫికేషన్‌ను పరిపాలనా కారణాల వల్ల నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు తెలిపారు. ఆర్‌సీ నంబర్ 7963/డీఎంఈ/కంబైన్డ్ నోటిఫికేషన్/జీఎంసీ/కేడీపీ/2023, తేదీ 28-11-23, దినపత్రికల్లో 30-11-2023న ప్రచురితమైన నోటిఫికేషన్‌ను నిలుపుదల చేసినట్లు తెలిపారు. తాజా నోటిఫికేషన్‌ను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు.

పెరిగిన వేతనం.. వెల్లివిరిసిన ఆనందం

- పార్ట్‌టైం పీజీటీలకు శుభవార్త
- రూ. 12 వేల నుంచి ఒకేసారి రూ. 26,759 పెరిగిన జీతం
- జిల్లాలో 18 మంది పీజీటీలకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న పీజీటీలు వారి కుటుంబికులు
- జూన్‌ నెలలో ప్రిన్సిపాల్స్‌, సీఆర్‌టీలు, పీఈటీలకు పెరిగిన వేతనాలు


సింహాద్రిపురం కేజీబీవీ

కడప ఎడ్యుకేషన్‌ : వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే నాడు- నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చారు. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బెల్టలతోపాటు రోజుకో మెనూతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. చిక్కీలు, రాగి జావ వంటి వాటిని అందిస్తున్నారు. అనాథ, పేద పిల్లలు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)ను ఏర్పాటు చేశారు. వాటిలో వేల మంది అనాథ, పేద పిల్లలు చదువుకుని విద్యావంతులుగా తయారై ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పదవ తరగతి తరువాత కొంతమంది బాలికలు బడికి దూరమవుతున్నట్లు గ్రహించి మరో అడుగు ముందుకేసి కేజీబీవీల్లో ఇంటర్‌ విద్యను ప్రవేశ పెట్టారు.

జిల్లాలో 18 మంది పీజీటీలకు లబ్ధి..

జిల్లావ్యాప్తంగా 17 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో 2018–19 సంవత్సరంలో ఇంటర్‌ విద్యను అప్‌గ్రేడ్‌ చేశారు. వీటిలో ఇంటర్‌ తరగతులను బోధించేందుకు అప్పట్లో పార్ట్‌టైం కింద 18 మంది పీజీటీలను ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి రూ. 12 వేల వేతనం నిర్ణయించారు. వీరంతా తమకు జీతాలు పెంచాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం రూ. 12 వేలు ఉన్న జీతాన్ని ఒకేసారి రూ. 26,759కి పెంచింది. ఈ మేరకు సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్‌ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి పెరిగిన జీతం డిసెంబర్‌ 1వ తేదీ నుంచి వర్తింపనుంది. దీంతో వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పీజీటీ, ప్రిన్సిపాల్‌ పోస్టులను కూడా...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జులై నెలలో కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్‌, పీజీటీ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఇందులో 29 కేజీబీవీలలో 128 మందికి గాను 123 మందికి ఉద్యోగాలను కల్పించారు. ఇందులో 8 మందికి ప్రిన్సిపాల్స్‌గా, 89 మందికి పీజీటీలుగా, 20 మందికి సీఆర్‌టీలుగా మరో 6 మందికి పీఈటీ పోస్టులను ఇచ్చారు.

జూన్‌లో పెరిగిన వేతనాలు...

కేజీబీవీలలో పనిచేసే పీజీటీలకు తప్ప మిగతా ప్రిన్సిపాల్స్‌, పీఆర్‌టీలకు, పీటీలకు ఈ ఏడాది జూన్‌ నెలలో వేతనాలు పెంచారు. ఇందులో ప్రిన్సిపాల్స్‌కి రూ. 27,755 ఉండే వేతనాన్ని రూ. 34,139 పెంచారు. అలాగే సీఆర్‌టీలకు రూ. 21,755 నుంచి 26,759, పీఈటీలకు రూ. 21,755 నుంచి 26,759లకు పెంచారు. అలాగే పీజీటీలకు కూడా తాజాగా రూ. 12 వేల నుంచి ఒకేసారి రూ. 26,759 పెంచేశారు.

కేజీబీవీల్లో పనిచేసే సిబ్బంది వారి జీతాలు గతంలో.. ఇప్పుడు

కేడర్‌	పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య	గతంలో ఇస్తున్న వేతనం	ప్రస్తుతం ఇస్తున్న వేతనం
ప్రిన్సిపాల్స్‌	14	రూ. 27,755	రూ. 34,139
పీజీటీలు	18	రూ. 12000	రూ. 26,759
పీఆర్‌టీలు	115	రూ. 21,755	రూ. 26,759
పీఈటీలు	14	రూ.21,755	రూ. 26,759

చాలా సంతోషంగా ఉంది



నేను చాపాడు మండలం కేజీబీవీలో మ్యాథ్స్‌ సబ్జెక్టును బోధిస్తున్నాను. చాలా కాలం నుంచి నేను రూ. 12 వేల వేతనంతో పనిచేశాను. మా జీతాలు పెంచాలని పలుమార్లు మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాము. స్పందించిన ప్రభుత్వం రూ. 26,759కి పెంచింది. చాలా సంతోషంగా ఉంది.మేము ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాము. – వసుంధర, మ్యాథ్స్‌ పీజీటీ, కేజీబీవీ, చాపాడు

వేతనం పెరిగింది..



మాకు గతంలో రూ. 21,755 వేతనాన్ని ఇచ్చే వారు. అలాంటిది ఈ ఏడాది జూన్‌ నెలలో మాకు కూడా వేతనాన్ని పెంచారు. ప్రస్తుతం నా వేతనం రూ. 26,759 వస్తుంది. చాలా సంతోషంగా ఉంది. – రమాదేవి, సీఆర్‌టీ, కేజీబీవీ, దువ్వూరు.

డిసెంబర్‌ నెల నుంచే..



కేజీబీవీల్లో పనిచేసే పీజీటీలకు పెంచిన వేతనం డిసెంబర్‌ నెల నుంచి వర్తిస్తుంది. వీరికి జనవరి నెలలో పెరిగిన జీతం చేతికి వస్తుంది. కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ దాదాపు భర్తీ చేశాము. దీంతో కేజీబీవీల్లో చదువుతున్న పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుంది. – అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి.

హత్య కేసులో నిందితులకు రిమాండ్‌

చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని మామిళ్లపల్లి సమీపంలో నవంబర్‌ 26న జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను గురువారం కోర్టులో హాజరుపరచినట్లు సీకే దిన్నె ఎస్‌ఐ బి. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కడప నగరం ప్రకాష్‌ నగర్‌లో నివాసం ఉంటున్న మృతుడి కుమారుడు కానగల సుభాష్‌, అతని మిత్రులు బద్రి, వరుణ్‌లతో కలసి ఈ హత్య చేశారన్నారు. కడప డీఎస్పీ షరీఫ్‌, రూరల్‌ సీఐ శంకర్‌ నాయక్‌ పర్యవేక్షణలో ఈ కేసును ఛేదించినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్‌ రిమాండ్‌ విధించారన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్‌కు 6 నెలల జైలు శిక్ష

– రూ. 10వేలు జరిమానా

కడప అర్బన్‌ : కడప తాలూకా పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో 2020 ఆగస్టు 7న బిల్టప్‌ సర్కిల్‌ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌ సైకిల్‌ను, టాటా ఏస్‌ వాహనం ఢీకొనగా ఎద్దు హరికుమార్‌ తీవ్ర గాయాలపాలయ్యాడు. అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో హరికుమార్‌ సోదరుడు ఎద్దు శ్రీకాంత్‌ ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదానికి కారణమైన టాటా ఏస్‌ డ్రైవర్‌ పెద్దయ్యగారి రామాంజనేయులుపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో రెండవ ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి కె. భార్గవి నిందితుడు పెద్దయ్యగారి రామాంజనేయులుకు 6 నెలల జైలుశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన ఏపీపీ శ్రీకాంత్‌ను, కోర్టు మానిటరింగ్‌ ఇన్‌స్పెక్టర్‌ మధుసూదన్‌రావు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సిద్దార్థ్‌ కౌశల్‌ అభినందించారు.

నవశకం



సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మాకు ఇప్పటి వరకు నివాసం ఉండేందుకు ఇల్లు కూడా లేదు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే నవరత్నాలులో భాగంగా రాచాయపేట జగనన్న కాలనీలో నా పేరు మీద ఇంటి స్థలం కేటాయించి ఇల్లు కూడా మంజూరు చేశారు. ప్రభుత్వం ద్వారా రూ.1.50 లక్షలు, ఉపాధి హామీ ద్వారా రూ.30 వేలు అందింది. మొత్తం రూ.1.80 లక్షలతో నేను ఇల్లు నిర్మించుకున్నాను. సకాలంలో డబ్బులు రావడంతో ఇల్లు పూర్తి చేసుకోగలిగాం. నీడ కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – మేరువ అరుణమ్మ, యల్లారెడ్డిపేట, గోపవరం మండలం

ఆరోగ్యశ్రీ కార్డు వచ్చింది



మాది నిరుపేద కుటుంబం. పట్టణంలోని పూలబావి వీధిలో నివాసముంటున్నాము. గత పదేళ్లుగా ఆరోగ్యశ్రీ కార్డు కోసం అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నాను. కార్యాలయాల చుట్టూ కూడా తిరిగాను. కానీ ఎటువంటి ఫలితం లేదు. మా వీధి వలంటీర్‌ వచ్చి మీకేమైనా సమస్యలు ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోండి అని చెప్పారు. వెంటనే సచివాలయంలోకి వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఒక్క రోజులోనే ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేశారు. ఇంత గొప్ప కార్యక్రమం ప్రవేశపెట్టిన జగనన్నకు కృతజ్ఞతలు. – షేక్‌ మెహరూన్‌, పూలబావివీధి, బద్వేలు

ఒక్కరోజులోనే ధ్రువీకరణపత్రం వచ్చింది



ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగాను. కాని రాలేదు. ఇటీవల ఎం.కంబాలదిన్నె గ్రామంలో అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని గ్రామ వలంటీరు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆదాయ, కుల ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకోగా ఒక్కరోజులోనే పిలిచి పత్రాలను అందించారు. గతంలో చాలా ఇబ్బంది పడ్డాను. – మూడే లక్ష్మీబాయి, బోగాలకట్ట, మైలవరం మండలం

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

– రూ.2,05,000 స్వాధీనం

సంబేపల్లె : ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రెండు లక్షల ఐదువేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి రూరల్‌ సీఐ తులసీరామ్‌ తెలిపారు. గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లి పంచాయతీలో పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారం అందడంతో తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌ వివరాల నమోదుకు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్‌ : జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగిన నేషనల్‌ మీన్స్‌ కం మెరిట్‌ స్కాలర్‌షిప్‌(ఎన్‌ఎంఎంఎస్‌) పరీక్షలో ఎంపికైన విద్యార్థులు నేషనల్‌ స్కాలర్‌షిప్‌ పోర్టల్‌లో తమ వివరాల నమోదుకు ప్రభుత్వం డిసెంబర్‌ 31వ తేదీ వరకు గడువు పొడిగించిందని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. విద్యార్థి వివరాలు ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా మెరిట్‌కార్డ్‌పైన ముద్రించిన విధంగానే ఆధార్‌, బ్యాంకు పాస్‌బుక్‌లో ఉండే విధంగా సరి చూసుకుని పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే 2019 నవంబర్‌, 2021 ఫిబ్రవరి, 2022 మార్చిలో ఎంపికై ప్రభుత్వ, ఎయిడెడ్‌ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ సంవత్సరం తప్పకుండా రెన్యువల్‌ చేయించుకోవాలని సూచించారు.

విద్యుత్‌ షాక్‌తో యువకుడి మృతి

గాలివీడు : మండల పరిధిలోని గుండ్ల చెరువు గ్రామం దుర్గమ్మ చెరువులో మండల కేంద్రం చాపల కాలనీకి చెందిన బి.నారాయణ కుమారుడు బి. మనోహర్‌ (22) విద్యుత్‌ ప్రమాదంలో మృతి చెందాడు. స్తంభానికి స్టే వైర్‌ ఉండడంతో చెరువు నీటికి స్టే వైర్‌ ద్వారా విద్యుత్‌ సరఫరా కావడంతో చేపల వేటకు వెళ్లిన మనోహర్‌ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కర్నాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌ చేసినట్లు వన్‌టౌన్‌ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. బుధవారం రాత్రి నక్కలదిన్నె ఆర్చి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కోళ్లబైలు పంచాయతీ వెంకటేశ్వరపురానికి చెందిన జి.భరత్‌కుమార్‌(28) ద్విచక్రవాహనంలో 28 టెట్రాప్యాకెట్ల కర్నాటక మద్యం తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. మద్యం విలువ దాదాపు రూ.2,786 ఉంటుందన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్‌ అధికారులు

తల్లిదండ్రులు, బంధువులకు కౌన్సెలింగ్‌


బాల్యవివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ ఇస్తున్న ఐసీడీఎస్‌, పోలీసు అధికారులు

మదనపల్లె : ఇంటర్‌ చదువుతున్న బాలికకు వివాహం చేసేందుకు ప్రయత్నిస్తున్న తల్లిదండ్రులు, బంధువులను నిలువరించి, బాల్యవివాహం జరగకుండా ఐసీడీఎస్‌ అధికారులు, పోలీసులు అడ్డుకున్న ఘటన గురువారం జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రామాలయం వీధిలో బాల్యవివాహం జరుగుతోందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐసీడీఎస్‌ సీడీపీఓ సుజాత, టూటౌన్‌ ఏఎస్‌ఐ రమణ, సిబ్బందితో కలిసి బాలిక ఇంటికి వెళ్లారు. స్థానికంగా నివాసం ఉంటున్న బ్రహ్మచారి, లలిత దంపతులకు ఒక కుమారుడు. కుమార్తె ఉన్నారు. వీరిలో కుమారుడు నాలుగోతరగతి చదువుతుండగా, కుమార్తె తేజస్విని(16) పట్టణంలోని ఓ ప్రైవేట్‌ కళాశాలలో ఇంటర్‌ చదువుతోంది. బాలిక తల్లిదండ్రులు తిరుపతిలో నివసిస్తూ, వరుసకు బంధువులైన వెంకటరమణాచారి, శారదమ్మ కుమారుడు సునీల్‌(24)తో శుక్రవారం ఉదయం వివాహం చేయాలని నిర్ణయించి, ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. మైనర్‌ బాలికకు వివాహం చేస్తున్నారన్న విషయం సచివాలయ మహిళా సంరక్షణాధికారి(ఎంఎస్‌కే) ద్వారా ఐసీడీఎస్‌ అధికారులకు తెలవడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకుని అబ్బాయి, అమ్మాయి తరపు తల్లిదండ్రులు, బంధువులకు కౌనెలింగ్‌ నిర్వహించారు. హిందూ వివాహ చట్టం ప్రకారం వధువుకు 18, వరుడికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని, మైనర్లకు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని, కారకులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమ్మాయికి 18 సంవత్సరాలు నిండేంతవరకు వివాహం జరపబోమని అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రుల వద్ద లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్‌ రాయించుకున్నారు.

ఆర్టీపీపీ సిబ్బంది సమస్యలను పరిష్కరించండి


ఏపీ జెన్‌కో డైరెక్టర్‌ బాబ్జిని కలిసిన వైఎస్సార్‌ విద్యుత్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ నాయకులు

ఎర్రగుంట్ల : ఏపీజెన్‌కో పరిధిలో నడుస్తున్న రాయలసీమ థర్మల్‌ పవర్‌ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్‌ఆర్‌ విద్యుత్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు జి. మహేశ్వరరెడ్డి కోరారు. గురువారం సాయంత్రం ఆర్టీపీపీకి వచ్చిన ఏపీ జెన్‌కో డైరెక్టర్‌ బాబ్జిని కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆర్టీపీపీ నుంచి రామేశ్వరం రోడ్డును, ఆర్టీపీపీ కాలనీలోని రోడ్లను బాగు చేయాలన్నారు. అలాగే ఆర్టీపీపీలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను రిపేరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌ రీజినల్‌ అధ్యక్షుడు వి.రామయ్య, రీజినల్‌ సెక్రటరీ ఎస్‌. మహేశ్వరరెడ్డితో పాటు యూనియన్‌ నాయకులు పాల్గొన్నారు.

అల్పపీడనంతో అప్రమత్తంగా ఉండాలి

– జిల్లా పశువైద్యాధికారి శారదమ్మ

కడప అగ్రికల్చర్‌ : అల్పపీడనం కారణంగా జిల్లాలో శని, ఆది, సోమవారాల్లో భారీ వర్ష సూచనకు అవకాశం ఉన్నందున జిల్లాలోని పాడిరైతులు, గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్‌ శారదమ్మ తెలిపారు. ముఖ్యంగా గొర్రెపిల్లలు, లేగపిల్లలను చలికి గూడులోనే ఉంచాలని ఆరుబయట ఉంచకూడదని తెలిపారు. అలాగే గేదెలు, ఆవులు, ఎద్దులను ఆరుబయట, చెట్లకింద, సరిగా లేని షెడ్లలో ఉంచకూడదన్నారు. అవి వర్షం కారణంగా కూలడం వల్ల కూడా మరణాలు సంభవించే ప్రమాదం ఉంటుందన్నారు. జిల్లాలోని పశు వైద్యులు, పశు సహాయక సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అత్యవసర వైద్య సదుపాయాలు అందించాలని ఆమె సూచించారు.

కడప రిమ్స్‌ పీపీటీసీటీకి ఎన్‌ఏబీఎల్‌ గుర్తింపు సర్టిఫికెట్‌


గైనకాలజీ వైద్యులను అభినందిస్తున్న రిమ్స్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రమాదేవి

కడప అర్బన్‌ : కడప రిమ్స్‌కు వచ్చే రోగులకు రక్తపరీక్షల్లో భాగంగా హెచ్‌ఐవీతో పాటు, ఇతర పరీక్షలను చేస్తారు. ప్రధానంగా గర్భిణులకు పీపీటీసీటీ సెంటర్‌ ద్వారా పరీక్షలను నిర్వహించడంతో పాటు, కౌన్సెలింగ్‌ కూడా చేస్తారు. ఈ విధానంలో కడప రిమ్స్‌ గైనకాలజీ విభాగం హెచ్‌ఓడీతో పాటు వైద్యులు కీలకపాత్ర పోషిస్తారు. కడప రిమ్స్‌లోని పీపీటీసీటీకి నేషనల్‌ అక్రిడిటేషన్‌ టెస్టింగ్‌ అండ్‌ కాలిబ్రేషన్‌ ల్యాబరేటరీస్‌ వారు 2026 నవంబర్‌ 29 వరకు గుర్తింపును ఇచ్చి సర్టిఫికెట్‌ అందజేశారు. ఈ సందర్భంగా గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్‌ లక్ష్మిసుశీల, పీపీటీసీటీ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ రేఖారావు, ల్యాబ్‌ టెక్నీషియన్‌ శ్రీనివాసులు, కౌన్సిలర్‌ మారుతీదేవి, గైనకాలజీ వైద్యులు, సిబ్బందిని సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రమాదేవి అభినందించారు.

డ్రంక్‌అండ్‌ డ్రైవ్‌ కేసులో ఏడుగురికి జైలు


డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో శిక్ష పడిన నిందితులు

రాయచోటిటౌన్‌ : మద్యం తాగి వాహనాలు నడిపినందుకు ఏడుగురికి జైలు శిక్ష ఖరారు చేస్తూ ఏజేఎఫ్‌సీఎం ఎస్‌ఎంటీకే శారద తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌ ఎస్‌ఐ మహమ్మద్‌ రఫీ తన సిబ్బందితో కలసి పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. వారిలో ఏడుగురు మద్యం తాగి వాహనాలు నడిపినట్లు నిర్ధారణ కాగా వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. వీరిని విచారించిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని తెలిపారు.

చెలరేగిన బ్యాట్స్‌మన్‌


వై. తేజారెడ్డి (150 పరుగులు)


రవికిరణ్‌ (121 పరుగులు)


ధరణికుమార్‌నాయుడు (102 పరుగులు)


దుర్గాకుమార్‌ (100 పరుగులు)

నాలుగు సెంచరీలు నమోదు

కడప స్పోర్ట్స్‌ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్‌ జోనల్‌ అండర్‌–23 మల్టీడేస్‌ క్రికెట్‌ పోటీల్లో బ్యాట్స్‌మన్‌ చెలరేగడంతో భారీ స్కోరు నమోదైంది. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 379 పరుగుల ఓవర్‌నైట్‌ స్కోరుతో బరిలోకి దిగిన నార్త్‌జోన్‌ జట్టు 135.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 639 పరుగుల భారీ స్కోరు నమోదు చేసి డిక్లేర్‌ చేసింది. జట్టులోని రవికిరణ్‌ 121 పరుగులు, జె. దుర్గాకుమార్‌ 100 పరుగులతో రాణించారు. సెంట్రల్‌జోన్‌ బౌలర్లు నవీన్‌ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్‌ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 42 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 121 పరుగులు చేసింది. జట్టులోని దుర్గాబాలాజీ 48 పరుగులతో క్రీజులో ఉన్నాడు. నార్త్‌జోన్‌ బౌలర్‌ శ్రీకర్‌సాయిరెడ్డి 2, వాసు 2 వికెట్లు తీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి నార్త్‌జోన్‌ జట్టు 518 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

కేఓఆర్‌ఎం మైదానంలో..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మరో మ్యాచ్‌లో 358 పరుగుల ఓవర్‌నైట్‌ స్కోరుతో బరిలోకి దిగిన రెస్ట్‌ ఆఫ్‌ జోన్‌ జట్టు రెండోరోజు గురువారం మరో నాలుగు పరుగులు చేసి 362 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని మహేంద్రయాదవ్‌ 51 పరుగులు చేశాడు. సౌత్‌జోన్‌ బౌలర్లు సంతోష్‌కుమార్‌ 3, మల్లికార్జున 3, అఖిల్‌ 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ బ్యాటింగ్‌ ప్రారంభించిన సౌత్‌జోన్‌ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 84.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 323 పరుగులు చేసింది. జట్టులోని వై. తేజారెడ్డి 150 పరుగులు, ధరణికుమార్‌నాయుడు 102 పరుగులు చేశారు. రెస్ట్‌ ఆఫ్‌ జోన్‌ బౌలర్లు చెన్నారెడ్డి 2, ఆశిష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

విద్యుత్‌ కార్మికుల నిర్బంధం

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె మేజర్‌ గ్రామ పంచాయతీ, అరవపల్లి ఆర్‌ఎస్‌ రోడ్డులోని పాత స్టేట్‌బ్యాంక్‌ ఆవరణలో విద్యుత్‌ కార్మికులను ఇంటి యజమాని నిర్బంధించిన సంఘటన గురువారం జరిగింది. పాత స్టేట్‌ బ్యాంక్‌ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ కాలిపోయింది. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేసేందుకు విద్యుత్‌ అధికారులు ఆ భవన ఆవరణలోకి ట్రాన్స్‌ఫార్మర్‌ ఉన్న వాహనంతో వెళ్లారు. ఆ భవన యజమాని ఎవరిని అడిగి లోనికి వచ్చారంటూ వారిని నిర్బంధించాడు.

సీపీఎం జిల్లా కార్యదర్శిపై ఫిర్యాదు

బి.కొత్తకోట : సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, మరికొందరిపై మండలంలోని గోళ్లపల్లె గ్రామానికి చెందిన పి.వెంకటరమణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సర్వేనంబర్‌ 427/బి 2 బి లోని 2.27 ఎకరాల భూమి వంశపార్యంపర ఆస్తి అని, ఈ భూమిలోకి బుధవారం శ్రీనివాసులుతోపాటు మరికొందరు దౌర్జన్యంగా ప్రవేశించి జేసీబీతో భూమి స్థితిని దెబ్బతిసేలా పనులు చేయించారని పేర్కొన్నారు. భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేశారన్నారు.





వివాహ వేడుకలలో కట్టే చీరలే దివ్యంగా వెలిగిపోతుంటాయి.
ఇక వాటికి అదనంగా మరో స్టయిల్‌ను కూడా జోడిస్తే..
ఆ వెలుగులు రెట్టింపు అవుతాయి.
పట్టు, వెల్వెట్, ఎంబ్రాయిడరీ దుపట్టా చీర మీదకు ధరించినా,
డ్రేపింగ్‌లో జత చేసినా ఆ స్టైల్ హుందాగా కనిపిస్తుంది.
ఈ వింటర్ సీజన్‌కి ప్రత్యేకంగా ఉండటమే కాదు చలి నుంచి రక్షణను కూడా ఇస్తుంది.
ఎవర్‌గ్రీన్‌గా ఉండే శారీ కట్టుకి
మహారాణి కళను తెచ్చే దుపట్టా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుంది.

డబుల్ అట్రాక్షన్





కాంట్రాస్ట్
శారీ కలర్, దుపట్టా కలరా పూర్తి కాంట్రాస్ట్ ఉన్నది ఎంచుకోవాలి. దీనివల్ల రెండూ భిన్నంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

రంగు ఒకటే... డిజైన్ వేరు
సేమ్ కలర్ శారీ దుపట్టాను ఎంచుకున్నా ఎంబ్రాయిడరీ డిజైన్‌లో కాంబినేషన్స్ చూసుకోవాలి. చీర డిజైన్ హెవీగా ఉంటే, దుపట్టా డిజైన్ బ్రైట్‌గా ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. పట్టు శారీ మీదకు డిజైనర్ దుపట్టాను ఎంచుకునేటప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.







శాలువా స్టైల్
చీర మీదకు దుపట్టాను శాలువా మాదిరి కప్పుకున్నా ఈ సీజన్‌కి వెచ్చగా, బ్రైట్‌గా ఉంటుంది. అయితే, దుపట్టా గ్రాండ్‌గా ఉన్నది ఎంచుకోవాలి. ఇందుకు పట్టు, బ్రొకేడ్, ఎంబ్రాయిడరీ దుపట్టాలను చీరలను ఎంపికను బట్టి తీసుకోవాలి.

డ్రేపింగ్ దుపట్టా
చీరకట్టులో భాగంగా దుపట్టాను జత చేర్చి కట్టడం ఒక స్టైల్. ఈ కట్టును నిపుణుల ఆధ్వర్యంలో సెట్ చేయించుకోవాలి. ఈ కట్టుకు కూడా కాంట్రాస్ట్ కలర్స్ ఉండేలా చూసుకోవాలి.

* ధైర్యం

వ్యసనాల నుంచి వెలుగులోకి

పట్నాలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న రాఖీ శర్మ ఆ ఉద్యోగాన్ని వదిలేసి భర్త నడుపుతున్న రీహాబిలిటేషన్ సెంటర్‌ను తను స్వయంగా నిర్వహించడం మొదలుపెట్టింది. 5 వేల మంది ఇరవై ఏళ్ల లోపు పిల్లలను డ్రగ్స్ బారి నుంచి విముక్తి పొందేలా చేసింది. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి కౌన్సెలింగ్స్ ఇస్తోంది. మహిళలు వ్యసనానికి ఎలా లోనవుతున్నారు, వారు ఆ వ్యసనాల నుంచి బయట పడటం ఎలా అనే అంశంపై పని చేస్తున్నాను' అని వివరిస్తోంది రాఖీ. వ్యసనాలకు గురైన వారు వాటినుంచి బయటపడి తిరిగి సంతోషకరమైన జీవనాన్ని పొందేందుకు ఆమె చేస్తున్న స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం కీలక అంశాలు.

''ఒకరోజు అర్ధరాత్రి ఫోన్ కాల్ వచ్చింది. విషయం విని చాలా బాధ అనిపించింది. ఒక మహిళ బ్లేడ్‌తో ఒళ్లంతా కోసుకుంది. డ్రగ్స్ కారణంగా ఆమె వైవాహిక జీవితం దెబ్బతింది. మత్తు పదార్థాల నుంచి ఎలా బయటపడాలో ఆమెకు అర్థం కావడం లేదు. మహిళలు డీ–అడిక్షన్ సెంటర్లకు వెళ్లడం అనేది ఉందా.. అని నన్ను అడిగారు. మద్యపానం, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి అలవాటు పడిన వ్యక్తులు తమ అలవాటును వదిలించుకోవడానికి సహాయం చేయడం కూడా ఒక ముఖ్యమైన పని. నా మౌనం–పని ఈ రెండింటితో ఈ సెంటర్‌ను 22 ఏళ్లుగా నడుపుతున్నాను. వేలాదిమంది మాదకద్రవ్య వ్యసనం బారి నుంచి బయటికి తీసుకువచ్చాను. ఒకప్పుడు తమ జీవితాలు అంధకారంలో ఉండి, అన్ని వైపులా నిరాశకు గురైన వారు ఇప్పుడు వారి కుటుంబాలతో జీవిస్తున్నందుకు సంతోషపడుతున్నాను.


రాఖీ శర్మ

బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేసి..

పుట్టి పెరిగింది గురుగ్రామ్. కొన్నాళ్లు ఢిల్లీలోనే ఉన్నాను. జంషెడ్‌పూర్, కోల్‌కతాలలో చదువుకున్నాను. డాక్టర్ కావాలనుకున్నాను కాని బ్యాంక్ ఉద్యోగి అయిన నాన్న కోరిక మేరకు సీఏ చదివాను. పెళ్లయ్యాక పట్నా వచ్చాను. నేనూ బ్యాంకు ఉద్యోగం సంపాదించుకున్నాను. కానీ కుటుంబాన్ని, ఉద్యోగాన్ని ఏకకాలంలో నిర్వహించడం అంత సులభం కాదని కొన్ని రోజుల్లోనే అర్థమయ్యింది. అప్పటికే మా వారు డీ–అడిక్షన్ సెంటర్ నడుపుతున్నారు. కొన్నిరోజులు గమనించిన తర్వాత, బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేశాను. నిజానికి డీ–అడిక్షన్ సెంటర్ ఎలా పనిచేస్తుంది, మత్తు పదార్థాల నుంచి వ్యసనపరులను ఎలా బయట పడేయాలో ఏమాత్రం తెలియదు. కానీ క్రమంగా నేర్చుకున్నాను.



వీధి బాలలు, అనాథలు, వదిలి వేయబడిన పిల్లలు ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారారు. అలాంటి పిల్లల కోసం ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించాం. వీధి బాలల కార్యక్రమాన్ని కూడా నిర్వహించాం. 30 –35 మంది పిల్లలకు భోజనం, పానీయం, విద్య అన్ని ఏర్పాట్లు ఇచ్చే చోట ఈ కేంద్రానికి వసతి కల్పించే సామర్థ్యం కల్పించాం.

కాల్చివేస్తానని బెదిరింపులు..

బీహార్‌లో డీ–అడిక్షన్ సెంటర్ నడపడం చాలా కష్టం. మాదకద్రవ్యాల వ్యసనాన్ని వదిలించుకోవడానికి ఎక్కువగా నేర నేపథ్యం ఉన్న వారు వస్తారు. మంచి కుటుంబాలకు చెందిన పిల్లలు డ్రగ్స్‌కు బానిసలైతే పరువు పోతుందనే భయంతో వారిని బీహార్ నుంచి వేరే చోటకు పంపేవారు. ఇక ఓల్డ్‌సిటీలో డీ అడిక్షన్ సెంటర్‌కు వచ్చిన వారిని నిలువరించడం పెద్ద సవాలుగా ఉండేది. అలాంటి వాళ్లు మా కేంద్రానికి వచ్చి కొడతామంటూ ఉద్రేకంతో వస్తుంటారు. ఆ సమయంలో వారిపై వారికి అదుపు ఉండదు. వారి అలవాట్లను అడ్డుకుంటే బెదిరింపులు ఉండేవి. 'బయటకు వెళ్లాక చూడు.. నిన్ను కాల్చేస్తామ'నేవారు. కేంద్రాన్ని మూసివేస్తామని బెదిరింపులు. కానీ నేనేం తప్పు చేయట్లేదు. భయమెందుకు?

జైలులో డ్రగ్స్ నుంచి మహిళా ఖైదీల వరకు...

పట్నాలోని బ్యూర్ జైల్లో ఖైదీల కోసం 10 ఏళ్లపాటు డీ–అడిక్షన్ క్యాంప్ నడిపాను. మహిళాఖైదీలతో ఈ క్యాంప్ స్టార్ట్ అయ్యింది. జైలులో ఓ బాలిక తన బట్టలు చింపుకుని బీభత్సం సృష్టించింది. అప్పుడు నన్ను పిలిచారు. ఆమెను చూడగానే ఆ అమ్మాయి డ్రగ్ అడిక్ట్ అని అర్థమైంది. తనకు డ్రగ్స్ అందుబాటులో లేకపోవడంతో ఆమె అలా ప్రవర్తించింది. అప్పుడు అక్కడ ఖైదీల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో జైలు జడ్జికి నివేదించాను. జడ్జి ఆజ్ఞల మేరకు జైలులో మూడు రోజుల పాటు డీ–అడిక్షన్ క్యాంపు నిర్వహించాను. ఇదివరకు 1000 మందికి పైగా ఖైదీలు పాల్గొన్నారు. వందలాది మంది ఖైదీలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

నిషేధం తర్వాత..

ఒక డ్రగ్ మానేస్తే మరో మందు వాడటం మొదలు పెడతారు. బీహార్‌లో మద్య నిషేధం తర్వాత ఈ ట్రెండ్ కనిపించింది. ఇప్పుడు ప్రజలు గంజాయి, ఇతర డ్రగ్స్ ఎక్కువగా తీసుకుంటున్నారు. అయితే డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులు మద్యం కంటే వారి వ్యసనం నుండి బయటపడటం చాలా కష్టం. నిషేధం కారణంగా, ప్రజలు డీ–అడిక్షన్ సెంటర్‌లకు రావడం మానేశారు. ఆ తర్వాత జిల్లా ఆసుపత్రుల్లో డీ–అడిక్షన్ కోసం 15 ప్రత్యేక పడకలను అందించేందుకు కృషి చేశాం. ఆ తర్వాత ఈ విషయంలో వైద్యులకు శిక్షణ కూడా ఇచ్చాం. 5 వేల మంది పిల్లలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

మహిళల కోసం..

చాలా మంది మహిళలు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండానే డ్రగ్స్ అలవాటు నుంచి బయటపడేందుకు వస్తుంటారు. మహిళల కోసం ప్రత్యేక డీ–అడిక్షన్ సెంటర్ కూడా ఉంది. చాలా మంది మహిళలు తమ గుర్తింపును దాచుకుంటారు, కొందరు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇక్కడకు వస్తారు.

ఓ మహిళ భర్త దుబాయ్‌లో ఉన్నాడు. అక్కడి నుంచి ఖరీదైన మద్యం తెచ్చేవాడు. ఆమె తన బిడ్డతో ఇంట్లో ఒంటరిగా ఉంటూ మద్యం సేవించి క్రమంగా దానికి బానిసయ్యింది. పట్టించుకునేవారెవరూ లేకపోవడంతో ఆమె బిడ్డ చదువుకు దూరమయ్యాడు. దాంతో డీ–అడిక్షన్ సెంటర్‌కి వెళ్లి, కొన్ని సెషన్స్ తర్వాత నార్మల్‌గా మారింది.

అదేవిధంగా పట్నాలోని ఓ ఉన్నత కుటుంబానికి చెందిన ఓ మహిళ డ్రగ్స్‌కు బానిసైంది. ఆమె ఎంబీఏ చేసింది. తల్లి చైనాలో, సోదరుడు అమెరికాలో ఉన్నారు. ఆమె వైవాహిక జీవితం బాగోలేదు. విడాకుల తర్వాత ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. డీ–అడిక్షన్ సెంటర్‌కు వచ్చేటప్పటికి ఆమె శరీరంపై చాలా కోతలు ఉన్నాయి. బ్లేడుతో తానే కోసుకుని ఆనందించేది. కొన్నినెలల చికిత్స తర్వాత ఆమె సాధారణ స్థితికి వచ్చింది.

బీహార్‌కు చెందిన ఓ ఐఏఎస్ అధికారి మద్యానికి బానిసయ్యాడు. ఎంత ప్రయత్నించినా ఆ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నాడు. భార్య ప్రోద్బలంతో ఆ ఐఏఎస్ డీ–అడిక్షన్ సెంటర్‌లో చికిత్స తర్వాత తన వ్యసనాన్ని విడిచిపెట్టాడు. చాలా మంది డాక్టర్లు, ఇంజనీర్లు డీఅడిక్షన్ సెంటర్ కు వచ్చి విముక్తి పొందారు.'' అంటూ తను చేస్తున్న సేవ గురించి వివరించారు రాఖీ శర్మ ఎందరికో స్ఫూర్తిదాయకం.

వంటిల్లు

బఠాణితో బ్రేక్‌ఫాస్ట్...
క్యాబేజ్‌కి ఎగ్‌తో దోస్తీ... పప్పులోకి చిక్కుళ్లు.
ఊహకందని అరటికారం...
మన వంటింటి చమత్కారం

కూరలు అవే రుచులే వేరు

అరటి కాయ కారం పొడి



కావలసినవి: అరటికాయలు – మూడు; పసుపు – 1/2 టీ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; మినప్పప్పు – రెండు టీ స్పూన్లు; పచ్చిశనగ పప్పు – టీస్పూను; ధనియాలు – 2 టేబుల్ స్పూన్లు; ఎండుమిర్చి – ఐదు; మిరియాలు – టీస్పూను; ఎండు కొబ్బరి తురుము – నాలుగు టీస్పూన్లు; కరివేపాకు – ఐదు రెమ్మలు; ఇంగువ – చిటికెడు; నూనె – నాలుగు టీస్పూన్లు; ఆవాలు – అరటీస్పూను.

తయారీ: స్టవ్ వెలిగించి మీడియం మంట మీద అరటికాయలను కాల్చాలి. ● చక్కగా కాలాక మంట మీద నుంచి తీసి చల్లారాక తొక్కతీసేసి, సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు స్టవ్ మీద బాణలిపెట్టి టీస్పూను మినప్పప్పు, పచ్చి శనగపప్పు, ధనియాలు, ఎండు మిర్చి, మిరియాలు, ఎండు కొబ్బరి తురుము, మూడు రెమ్మల కరివేపాకు, ఇంగువ వేసి దోరగా వేగాక, చల్లారనిచ్చి పొడిచేసి పెట్టుకోవాలి. ●స్టవ్ మీద బాణలిపెట్టి నూనె వేయాలి. ● వేడెక్కిన తరువాత మిగిలిన మినప్పప్పు, ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి. ● చిటపటలాడాక అరటికాయ తురుము, పసుపు, రుచికి సరిపడా ఉప్పువేసి వేయించాలి. ● తరువాత మసాలా పొడి వేసి కలిపి మూతపెట్టి, సన్న మంట మీద ఐదు నిమిషాలు మగ్గనిస్తే అరటి కాయ పొడి రెడీ.

క్యాబేజ్ ఎగ్ భుర్జి



కావలసినవి: క్యాబేజీ తురుము – రెండు కప్పులు; నూనె – మూడు టేబుల్ స్పూన్లు; ఉల్లిపాయ తరుగు – అరకప్పు; అల్లం వెల్లుల్లి పేస్టు – ఒకటిన్నర టీస్పూన్లు; పచ్చిమిర్చి – చిన్నవి ఆరు(సన్నగా తరగాలి); ధనియాల పొడి – అరటీస్పూను; పసుపు – అరటీస్పూను; కారం – ముప్పావు టీస్పూను; గుడ్లు – నాలుగు; ఉప్పు – రుచికి సరిపడా; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత ఉల్లిపాయ తరుగు వేసి వేయించాలి. ● ఉల్లిపాయ వేగాక, అల్లం వెల్లుల్లి పేస్టువేసి వేయించాలి. ● అల్లం వెల్లుల్లి పేస్టు పచ్చివాసన పోయిన తరువాత పచ్చిమిర్చి తరుగు వేయాలి. ● మిర్చి వేగిన తరువాత ధనియాలపొడి, కారం, పసుపు, క్యాబేజీ తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి బాణలి మీద మూతపెట్టి సన్న మంట మీద మగ్గనివ్వాలి. ● గుడ్లసొనను ఒక గిన్నెలో వేసి బీటర్ లేదా ఫోర్క్‌తో కలిపి పక్కన పెట్టాలి. ● క్యాబేజీ ఉడికి దగ్గర పడుతున్నప్పుడు గుడ్ల సొనవేసి కలుపుతూ వేయించాలి. ● చక్కగా వేగిన తర్వాత కొత్తిమీర చల్లుకుని దించేయాలి. ● రోస్టెడ్ బ్రెడ్, చపాతీ, రోటీలోకి ఇది మంచి సైడ్ డిష్.

గ్రీన్ పీస్ ఊతప్పం



కావలసినవి: పచ్చిబఠాణి – కప్పు; సూజీ రవ్వ – కప్పు; బియ్యప్పిండి – మూడు టీస్పూన్లు; పచ్చిమిర్చి – మూడు; అల్లం – అరంగుళం ముక్క; కొత్తిమీర తరుగు – రెండు టీస్పూన్లు; జీలకర్ర – టీస్పూను; పెరుగు – అరకప్పు; వంటసోడా– 1/2 టీ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – ఊతప్పం కాల్చడానికి తగినంత.

తయారీ: మిక్సీజార్‌లో పచ్చిబఠాణి, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర, జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు వేసి తగినంత నీటిని వేస్తూ గ్రైండ్ చేయాలి. ● ఇప్పుడు ఒక పెద్ద గిన్నె తీసుకుని సూజీ రవ్వ, బియ్యప్పిండి, గ్రైండ్ చేసిన బఠాణి పేస్టు, పెరుగు కలిపి నానబెట్టాలి. ● అర గంట తరువాత రుచికి సరిపడా ఉప్పు, వంటసోడా, కొద్దిగా నీళ్లు పోసుకొని గరిట జారుడుగా కలుపుకోవాలి. ● పెనం వేడెక్కాక కొద్దిగా నూనె వేసి రెండు గరిటలు పిండి వేసి రొట్టెలా వేసుకోవాలి. దాని మీద సన్నగా తరిగిన ఉల్లిపాయ, క్యారట్, క్యాప్సికమ్ ముక్కలు వేసి మూత పెట్టి మంట తగ్గించాలి. ● ఓ నిమిషం తర్వాత మూత తీసి ఊతప్పాన్ని తిరగేసి మరో అర స్పూన్ నూనె వేసి రెండోవైపు కూడా కాల్చుకుంటే గ్రీన్‌పీస్ ఊతప్పం రెడీ. చట్నీ, సాంబార్‌తో చాలా బావుంటుంది.

చిక్కుడు కాయ పప్పు



కావలసినవి: చిక్కుడు కాయలు – పావు కేజీ; పెసరపప్పు – అరకప్పు; పసుపు – పావు టీస్పూను; పచ్చి కొబ్బరి తురుము – అరకప్పు; ఎండుమిర్చి – నాలుగు; జీలకర్ర – టీస్పూను; కరివేపాకు – నాలుగు రెమ్మలు; ఆవాలు – పావు టీస్పూను; నూనె – తగినంత; మినప్పప్పు – టీస్పూను; ఉప్పు – తగినంత.

తయారీ: పెసరపప్పుని కడిగి కుకర్ గిన్నెలో వేయాలి. ● దీనిలో కప్పుడునీళ్లు, పసుపు, 1/2 టీస్పూను ఉప్పు వేసి మూతపెట్టి రెండు విజిల్స్ రానివ్వాలి. ● చిక్కుడు కాయలను కడిగి ఈనె తీసి ముక్కలు చేసుకోవాలి. ● తగినన్ని నీళ్లు, చిటికెడు ఉప్పు వేసి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● పచ్చికొబ్బరి, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిర్చిని మిక్సీ జార్‌లో వేసి మెత్తని పేస్టు చేయాలి. ● ఉడికిన పెసరపప్పులో చిక్కుడు ముక్కలు, నూరుకున్న మసాలా పేస్టు, ఉప్పువేసి కలపాలి. ● ఒక పాత్రలో నూనె వేసి వేడెక్కిన తర్వాత ఆవాలు, మినప్పప్పు వేసి చిటపటలాడాక మిగతా కరివేపాకు వేసి వేయించి అందులో పప్పు మిశ్రమాన్ని కలిపితే చిక్కుడుకాయ పప్పు రెడీ. అన్నం, చపాతీ, రోటీల్లోకి చాలా బావుంటుంది.